విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 03, నవంబర్ 2023

8న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయండి

బంద్ గోడపత్రికలు విడుదల చేసిన విద్యార్థి యువజన సంఘాల నాయకులు

విశాలాంధ్ర –డోన్ రూరల్: ఈనెల 8న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్య ప్రతాప్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్ యాదవ్, టీడీపీ పట్టణ కార్యదర్శి శివ కిషోర్ లు గురువారం పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక త్యాగాలతో విద్యార్థి యువజన నాయకుల 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ జరుగుతున్న పోరాటం ఈనెల 8 నాటికి వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొనడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ కి పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి స్థానిక యువతకి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 8న రాష్ట్రవ్యాప్తంగా కేజీ టు పేజీ వరకు జరిగే విద్యాసంస్థల బంద్‌కు ప్రతిఒక్కరూ మద్దతు తెలిపి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివ కేశవులు, చంద్ర శేఖర్ నాయక్, బంగారప్ప దుర్గా తిమ్మారెడ్డి, కేశవులు, మధు, లక్ష్మీనారాయణ, జయచంద్ర, తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్యాపిలి: ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్, టీడీపీ నాయకులు ప్రభుత్వం తక్షణమే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణఆపాలని, కడపఉక్కు పరిశ్రమలను ప్రారంభించాలని కలసికట్టుగా ఈనెల8న విద్యా సంస్థల బందును జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్య ప్రతాప్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రనాథ్ యాదవ్, టిడిపి పట్టణ కార్యదర్శి శివకిషోర్‌లు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి యువజన నాయకుల 32 మంది ప్రాణత్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ జరుగుతున్న పోరాటం ఈనెల 8 నాటికి వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొనడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ నిర్వహించాలని వారన్నారు. లాభాలు వస్తున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని, ఫ్యాక్టరీ అనుబంధంగా ఇనుము గనులు కేటాయించకపోవడం సిగ్గుచేటని ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది మందికి ఉపయోగపడుతున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే,చూస్తూ ఊరుకోమని వారు హెచ్చరించారు. ఈనెల8న రాష్ట్ర వ్యాప్తంగా కేజీ టు పేజీ వరకు జరిగే విద్యాసంస్థల బంద్‌కు ప్రతిఒక్కరూ మద్దతు తెలిపి సహకరించాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివ కేశవులు, చంద్ర శేఖర్ నాయక్, బంగారప్ప దుర్గా తిమ్మారెడ్డి, కేశవులు, మధు, లక్ష్మీ నారాయణ, జయచంద్ర, తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్ : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ ఆపాలని,కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఈనెల 8న తలపెట్టిన రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో గురువారం బంద్‌కు సంబంధించిన గోడపత్రికలు విడుదల చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగార్జున, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జునేద్‌బాష, ఎస్ఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి లింగేష్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 32మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ జరుగుతున్న పోరాటం ఈనెల 8 నాటికి 1000 రోజులు పూర్తి చేసుకోనున్న సందర్భంగా వామపక్ష విద్యార్థి,యువజన సంఘలు రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బందుకు పిలుపునిచ్చాయన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం రెండు సార్లు శంకుస్థాపన చేసిన కూడా ఎటువంటి అభివృద్ధి లేదని కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అయితే లక్షలాదిమంది రాయలసీమ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. తక్షణమే కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈనెల 8న రాష్ట్రవ్యాప్తంగా కేజీ టు పీజీ వరకు జరిగే విద్యాసంస్థల బంద్ కు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ, ఐసా,ఎస్ఎఫ్ఐ నాయకులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

నంద్యాల పార్లమెంట్ జిల్లా డిసిసి అధ్యక్షులు జె.లక్ష్మీ నరసింహ

విశాలాంధ్ర – నంద్యాల: రాయలసీమ ప్రాంతాన్ని కేంద్ర ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించి ప్రత్యేక బడ్జెట్ విడుదల చేయాలని నంద్యాల పార్లమెంట్ జిల్లా డిసిసి అధ్యక్షులు జె.లక్ష్మీ నరసింహ యాదవ్ పేర్కొన్నారు. గురువారం నంద్యాల పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నంద్యాల పార్లమెంటు జిల్లా డీసీసీ అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే రైతులకు నష్టపరిహారం లక్ష రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తుంటే జగన్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమన్నారు. 679 మండలాలకు గాను 400 మండలాలు కరువు కోరల్లో చిక్కుకున్నాయని, కానీ ప్రభుత్వ అధికారులు 103 మండలాలను మాత్రమే ప్రకటించడం దారుణమన్నారు. ఈ సమావేశంలో నంద్యాల పట్టణ అధ్యక్షుడు దాసరి చింతలయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్ రావు, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ బాలస్వామి, రాష్ట్ర స్పోకెస్ పర్సన్ వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతాం

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిని కార్పొరేట్ హాస్పిటల్స్ స్థాయిలో తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే గంగుల తమ మిత్రుడు మనోహర్ సహకారంతో దాదాపు రూ.12లక్షల విలువైన పరికరాలు వైద్యశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడమే తన ముందున్న లక్ష్యం అని అన్నారు. ఈసందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం ఆసుపత్రికి ఎక్విప్మెంట్ అందజేసిన ఎమ్మెల్యే గంగుల మిత్రుడు మనోహర్‌ను, ఎమ్మెల్యే గంగుల బావ సిద్ధార్థరెడ్డిని, ఎమ్మెల్యేని సన్మానించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సుజాత, ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, ఎంపీడీవో మహబూబ్ ఖాన్, దామోదర్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

తీగెల వంతెన టెండర్లు రద్దు.. వంతెన కమ్ బ్యారేజ్ నిర్మించండి

విశాలాంధ్ర – కోవెలకుంట్ల : కృష్ణా నది మీద 167 కే జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా నిర్మంచ బోయే తీగెల నిర్మాణానికి టెండర్లు పిలిచారని వాటిని రద్దు చేసి బ్రిడ్జి కమ్ బ్యారేజ్ నిర్మాణానికి టెండర్లు పిలవాలని రాయల సీమ జాయింట్ యాక్షన్ కమిటీ కో–ఆర్డినేటర్ కామని వేణుగోపాల్‌రెడ్డి మీడియా సమావేశంలో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమకు పోతిరెడ్డపాడు ద్వారా నీళ్లు అందాలంటే 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీశైలం డ్యాం నుంచి రావాలని అదీ 854 అడుగులు వుంటేనే పోతిరెడ్డపాడుకు సవ్యంగా నీళ్లు అందుతాయని అన్నారు.కేంద్ర ప్రభుత్వం 167 జాతీయ రహదారి నిర్మాణం కోసం అదే కృష్ణా నది మీద తీగెల వంతెన సుమారు రూ.1400 వందల కోట్ల ఖర్చుతో నిర్మాణం కోసం టెండర్లు పిలిచారని తీగెల వంతెన నిర్మాణం వలన రాయలసీమ తాగుసాగు నీటి ఎద్దడిని తీరదని కేవలం పర్యాటకులకు పర్యటించడానికి మాత్రమే పనికి వస్తుందని అదే అందమైన బ్రిడ్జి కమ్ బ్యారేజ్ రూ.1000 కోట్ల ఖర్చుతో నిర్మాణం పూర్తయి రాయలసీమ పోతిరెడ్డపాడుకు శాశ్వతంగా నీరు అందిస్తుందన్నారు. శ్రీశైలం డ్యాంకు వరదపోటు తగ్గిస్తూ బురద పెరుకోవడాన్ని కూడా తగ్గిస్తుందని వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బ్రిడ్జి కమ్ బ్యారేజ్‌తో పలు ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు.

ప్రజల భవిష్యత్తుకు బాబు గ్యారంటీ

విశాలాంధ్ర– నందికొట్కూరు: నందికొట్కూరు పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని 12,27 వార్డులలో టీడీపీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షకీల్ అహ్మద్ ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ ఇంటింటి కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జ్ మాండ్ర శివానందరెడ్డి పాల్గొనడం జరిగింది. సందర్భంగా ఆయన టిడిపి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం ఇంట్లో ఎంతమంది చదువుకున్న విద్యార్థులు ఉన్న వారందరికీ ఏడాదికి రూ.15000, అన్నదాతకు పథకం కింద రూ.20,000, అమలు చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కరపత్రాలను ప్రతి ఇంటికి వెళ్లి అందజేసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయ సూర్య,కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, ముత్తు జావలి,బి. జనార్ధన్, సౌదీ చాంద్ భాష, శాంతరాజు, సయ్యద్ అహ్మద్, రషీద్ ఖాన్, నిమ్మకాయల మోహన్, రాజు, బొల్లెద్దుల రాజన్న, కళాకరు, తదితరు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర–డోన్: నంద్యాలలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు పి.సుంకయ్య, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, సీపీఐ మండల కార్యదర్శి పులిశేఖర్, పట్టణ కార్యదర్శి బి.నారాయణ, మహిళా సమైక్య మండల కార్యదర్శి లక్ష్మీదేవి, అమ్మ దేవమణి గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య 15వ రాష్ట్ర మహాసభలో ఈనెల 17, 18,19 తేదీల్లో నంద్యాల జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయన్నారు. సమాజంలో మహిళలు కావడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు కుటుంబంలో హింస సమాజంలో నేర ప్రవృత్తి రోడ్డు ప్రమాదాలు అనారోగ్యాల ఆకాల మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో మద్యాన్ని నిషేధించాలని మహిళా సమేత పోరాడుతున్నదన్నారు. రాష్ట్రంలో వెనకబడిన ప్రాంతాలకు అభివృద్ధి కోసం తాగు, సాగునీరు ప్రాజెక్టుల్లో నిర్మిస్తున్న ప్రాంతాల్లోని నివాసితులకు పున నివాసం, సామాజిక న్యాయం కోసం హరిజన గిరిజన బడుగు బలహీన వర్గాల ప్రజల జీవనం విధానములో మార్పు కోసం మురుగైన జీవనం కోసం ఉద్యమిస్తుందని వెల్లడించారు. మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుండి మహిళలు పెద్దసంఖ్యలో తరలిరావాలని సభ్యత్వం ప్రతిపాదిక 600 మంది మహిళలు ప్రతినిధులుగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. మొదటి రోజు జరిగే మహా ప్రదర్శన వేలాది మంది మహిళలు పాల్గొనాలని రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని వారు కోరుతు ఉన్నారు. మున్ని, మాసుంబి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే లెవెల్ క్రాసింగ్ మూసివేతతో రైతుల అగచాట్లు

కొన్ని ఏళ్లుగా కొనసాగుతున్న రైతుల సమస్య

రైల్వే డిప్యూటీ ఇంజనీర్ కు రైతులు వినతిపత్రం

ప్యాపిలి–విశాలాంధ్ర : డోన్ నంద్యాల రైల్వే రెండవ లైన్ నిర్మాణ పనులను పర్యవేక్షించడానికి వచ్చిన గుంతకల్ డిప్యూటీ ఇంజనీర్ మురళికి రైతుల నుండి చేదు అనుభవం ఎదురయింది. నెరవాడ సమీపంలో గల రైల్వే లైన్ లోని బ్రిడ్జి 210 వద్ద రైతులు రైల్వే అధికారులను కలిసి డోన్ –నంద్యాల రైల్వే లెవెల్ క్రాసింగ్ కొన్నేళ్లుగా మూసి వేయడంతో రైతులు ప్రభుత్వ రస్తాను కోల్పోయి పొలాలకు దారి లేక కొన్ని వందల ఎకరాలకు రాకపోకలు లేకపోవడం వల్ల పొలాలు బీడు భూములుగా మారాయని, కూలి నాలి చేసుకునే కూలీలు రోడ్డున పడాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు గోపికృష్ణారావు, ప్రభాకర్‌రావు 85 మంది రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.గత 11 ఏళ్లుగాఈ సమస్యను ఎంపీ పోచ బ్రహ్మానం దరెడ్డి, ఉమ్మడి జిల్లా కలెక్టర్ లకు, జాయింట్ కలెక్టర్ లకు,రైల్వే అధికారులకు విన్నవించిన రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా మూసి వేసిన లెవెల్ క్రాసింగ్ స్థానంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి లేదా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేప ట్టాలని గుంతకల్ డిప్యూటీ చీఫ్ఇంజనీర్ మురళికి రైతులు గోపికృష్ణారావు,ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో వినతిపత్రం గురువారం అందజేశారు. రైల్వే నిర్మాణ మార్గాలు ఎంత అవసరమో దేశానికి అన్నం పెట్టే రైతుల జీవితాలు కూడా అంతే అవసరంగా రైల్వే అధికారులు గుర్తించాలని రైతులు వాపో యారు. మరి రైల్వే అధికారులు అన్నదాతల ఆవేదనను అర్థం చేసుకొని లెవెల్ క్రాసింగ్ తెరుస్తారా అన్నదాతల కడుపు కొడతారా వేచి చూడాల్సిందే. ఈకార్యక్రమంలో రైతులు సందీప్,రాముడు, చిరంజీవి,వెంకటేశ్వర్లు,రామసుబ్బయ్య, శ్రీనివాసులు,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టూరిస్ట్ రెస్టారెంట్ అభివృద్ధి పనులన పరిశీలన

విశాలాంధ్ర – నంద్యాల: చిన్న చెరువు గట్టుపై టూరిస్ట్ రెస్టారెంట్ లో వేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ పరిశీలించారు. గురువారం స్థానిక చిన్న చెరువు గట్టుపై టూరిస్ట్ రెస్టారెంట్ పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్నిచ్చేలా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించి గ్రీన్ కో అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. నంద్యాల పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్నిచ్చే రీతిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేసి వారం రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని టూరిజం అధికారులను ఆదేశించారు. పెండింగ్లో ఉన్న అరకొర పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రీన్ కో ప్రతినిధులను సూచించారు. రెస్టారెంట్ బిల్డింగ్ పునర్నిర్మాణ పనులు, చిన్నపిల్లల ఆట వస్తువులకు సంబంధించిన పరికరాలు, అవుట్డోర్ జిమ్, ల్యాండ్ స్కేపింగ్, వాకింగ్ ట్రాక్, చెరువు చుట్టూ ప్రమాద నివారణ నిమిత్తం ఏర్పాటు చేసే ఐరన్ రక్షణ ఫెన్సింగ్, ఫుడ్ కౌంటర్ తదితర పనులను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ ఖాళీ ప్రదేశాల్లో ఆకర్షించే రీతిలో గ్రీనరీ చేపట్టాలని సూచించారు. చెరువులో బోటింగ్ చేసేందుకు వీలుగా అందుబాటులో ఉంచిన మోటార్ బోట్లు, ఫెడల్ బోట్లను కలెక్టర్ పరిశీలించారు.

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయండి

విశాలాంధ్ర–చాగలమర్రి : ఈనెల 7న ఆళ్లగడ్డలో జరిగే సామాజిక సాధికార యాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం చాగలమర్రిలోని కూలూరు రస్తాలోని జగనన్న లేఔట్లలో మహబూబ్‌బాష అలియాస్ భారీక్ ఛామల్ నూతనంగా నిర్మించిన గృహాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం చాగలమరి పట్టణ వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న లేఔట్లలో గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. నియోజకవర్గంలో కేసీ కాలువ 16వ బ్లాక్ నుండి 27వ బ్లాక్ వరకు రైతులు అధిక సంఖ్యలో పంటలుసాగు చేశారన్నారు. పంటలు సాగు చేసిన రైతులను ఆదుకునేందుకు వారబంది ప్రకారం నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు.నియోజకవర్గంలో వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని ఈ విషయం పైముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నియోజకవర్గం లోని అన్ని మండలాలు కరువు మండలాలుగా ప్రకటించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం గంగుల కుటుంబం ద్వారానే అభివృద్ధి చెందిందని అందరికి తెలుసని కానీ ప్రతిపక్ష నాయకులకు అది కనబడడం లేదా అని ఆయన ప్రశ్నించారు. జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ షేక్ బాబూలాల్, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, ఉప మండల అధ్యక్షుడు ముల్లా రఫీ,జిల్లా సేవా దళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముల్లా జాబీర్, వెంకట రమణ, ముల్లా ఖాదర్‌బాష, ఇబ్రహీం, వార్డు సభ్యులు బ్రాం దీన్, షరీఫ్, హౌసింగ్ ఏఈ షఫీవుల్లా, భాష, బబ్లు, ప్రచార కార్యదర్శి రఫీలు పాల్గొన్నారు.

ఆలయ పున:ప్రారంభ భూమి పూజ - ఎమ్మెల్యే శిల్పా

విశాలాంధ్ర– ఆత్మకూరు రూరల్ : శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మండలం కృష్ణాపురం గ్రామం నందు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం పున: ప్రారంభ భూమి పూజా కార్యక్రమంలో పాల్గొని వేద పండితుల ఆశీర్వాదాలు పొందిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఈకార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు,ఆత్మకూరు వైఎస్ఆర్ పార్టీ మండల అధ్యక్షులు, మండల ఎంపీపీ, ఎంపీటీసీలు, ప్రజా ప్రతి నిధులు,వైసీపీ నాయకులు, వివిధ గ్రామాల నాయకులు, దేవదాయ శాఖ అధికారులు,కార్యకర్తలు

గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీ షర్టుల పంపిణీ

విశాలాంధ్ర – పాములపాడు : తుమ్మలూరులోని జడ్పీహెచ్ హైస్కూల్లో విద్యార్థులు బాల్ బ్యాడ్మింటన్, స్కిప్పింగ్లో జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎన్నికవ్వడం జరిగింది, ఈ సందర్భంగా పాఠశాలలో క్రీడాకారులకు అభినందన సభ ఏర్పాటు చేశారు.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల జడ్పీటీసీ జి.జ్యోతి, మండల వైసీపీ అధ్యక్షులు రామలింగేశ్వరరెడ్డిలు క్రీడాకారులను అభినందించారు. అనంతరం వారికి టీషర్టులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు ఉన్నతంగా రాణించాలంటే వారిలోని నైపుణ్యాలు వెలికి తీయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు అన్ని విధాలుగా తోడ్పాటు నందిస్తామని తెలిపారు.గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో తుమ్మలూరు గ్రామసర్పంచ్ వనమాల ప్రసాదరావు, జి వెంకటేశ్వర రెడ్డి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి

విశాలాంధ్ర –చాగలమర్రి: మండల పరిధిలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు కొత్తపల్లె అంకాళ్ (70) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ తెలుగు యువత నాయకులు భూమా జగఖత్ విఖ్యాత్ రెడ్డి గ్రామానికి చేరుకొని భౌతిక కాయం సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో టీడీపీ మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, నాయకులు లక్ష్మిరెడ్డి,రామ్మోహన్,శ్రీనివాసరెడ్డి,సంజీవరెడ్డి,హుసేన్ రెడ్డి,కేశవ రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర జూపాడుబంగ్లా: మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయ భవనంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నూర్జహాన్ తెలిపారు. ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ లు, కో –ఆప్షన్ సభ్యులు , మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆమె తెలిపారు.

రైతులకు ఎలుకల మందు పంపిణీ

విశాలాంధ్ర బనగానపల్లె: మండల పరిధిలోని కైపలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఎలుకల మందు పంపిణీ చేశారు. గురువారం వ్యవసాయ ఏది రాజశేఖర్ మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి ఓబులేష్ ఆధ్వర్యంలో ఎలుకల మందు పంపిణీ చేశారు. అనంతరం మందు తయారు చేసుకునే విధానం, మందు వినియోగంపై రైతులకు, ఆర్‌బికే, వీఏఏలకు అవగాహన కల్పించారు. వరి సాగులో ఎలుకల బెడద తీవ్రతను బట్టి తీసుకోవాల్సిన విధానంపై పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ప్రతాప్, నడిపెన్న, రైతులు ఆర్బీకే, వివిఏలు పాల్గొన్నారు.

సాఫ్ట్ బాల్ పోటీలకు డీ.పాలు విద్యార్థి

విశాలాంధ్ర – ఆత్మకూరు రూరల్ : మండల పరిధిలోని కరివేనలోని డి.పౌలు హై స్కూల్ ఫాదర్ జైసన్ మాట్లాడుతూ స్కూల్ గేమ్ ఫెడరేషన్ విభాగంలో అండర్ –17 విభాగంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో పి,మమత ఎంపికైనట్లు డి పౌలు స్కూల్ ఫాదర్ జైసన్ తెలిపారు. క్రీడారాణి ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు ఒంగోలులో జరగబోయే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్ షిఫ్‌లో పాల్గొంటుందని వెల్లడించారు. జిల్లా స్థాయిలో మంచి ప్రతిభను గనపరచి రాష్ట్రస్థాయి సాఫ్ట్బాల్ పోటీలకు ఎంపికైన పి.మమతను స్కూలు ప్రిన్సిపల్ జైసన్ స్కూల్ సమక్షంలో అభినందించారు. జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సాఫ్ట్‌బాల్ క్రీడకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడలకు ఎంతగానో కృషి చేస్తున్న పీఈటీ నాగేంద్రను జాతీయస్థాయిలో క్రీడాకారులు ఎదిగే విధంగా కృషి చేయాలన్నారు. విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమని ప్రిన్సిపల్ ఫాదర్ జైసన్ అన్నారు.

రాష్ట్రాభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలి

విశాలాంధ్ర బనగానపల్లి: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేవలం తెలుగుదేశం పార్టీతో సాధ్యమని అందుగ్గాన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి తీసుకురావాలని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నాడు మండల పరిధిలోని పసువల గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ అనే కార్యక్రమ నిర్వహించారు. పసువుల గ్రామానికీ చేరుకోగానే బాల నాయుడు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి పూలమాలలతో సన్మానించారు. అనంతరం గ్రామంలోని ప్రజా వేదిక వద్ద టిడిపి మినీ మేనిఫెస్టో సూపర్ సిక్స గురించి వివరించారు. 2024 సంవత్సరం ఎన్నికల్లో బనగానపల్లి నియోజకవర్గంలో రాష్ట్రంలో టిడిపి పార్టీని గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జ్ బొబ్బల గోపాల్ రెడ్డి, షేక్షావలి, బాలనాయుడు, భూషణ, కామేష్, పిపి మురళీమోహన్ రెడ్డి, గ్రామ ప్రజలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 03, నవంబర్ 2023

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

విశాలాంధ్ర – కర్నూలు లీగల్ : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ను ఉపసంహరించుకోవాలని, కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 8వ తేదీన జరిగే కేజీ నుండి పీజీ వరకు విద్యాసంస్థల బందును జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ. శ్రీరాములు గౌడ్, జిల్లా కార్యదర్శి ఎస్.షాబీర్ భాష, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్ కుమార్,ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మోడల్ స్కూల్ నందు బందు గోడపత్రికలను విడుదల చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణను నిలిపివేయాలంటూ కార్మికులు చేస్తున్న దీక్షలు 1000 పూర్తి చేసుకున్న సందర్భంగా నవంబర్ 8వ తేదీన కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థలు బంద్ కు పిలుపునివ్వడం జరిగిందని ఆయన తెలియజేశారు. మోదీ ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని వారన్నారు ప్రత్యేక హెూదాని తుంగలో తొక్కిందని ఉత్తరాంధ్ర రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడం లేదని బిజెపి నాయకులు రాష్ట్రంలో ఉన్నారా లేరా అని వారు ఎద్దేవా చేశారు జగన్మోహన్ రెడ్డి వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని కేంద్రం దగ్గర తాకట్టు పెట్టారని విమర్శించారు కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం ఒక్క పైసా నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటని వారన్నారు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోమని వారు హెచ్చరించారు భవిష్యత్తులో విద్యార్థి యువజన సంఘాలుగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు తెలియజేశారు.నవంబర్ 8వ తేదీన జరిగే బంద్ కు విద్యాసంస్థల యాజమాన్యాలు యువకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై మాట్లాడే దిక్కేలేదు... పి.రామచంద్రయ్య

విశాలాంధ్ర – ఆదోని రూరల్ : ఆంధ్ర రాష్ట్రంలో కరువు కాటకాలతో ప్రజలు అలమటిస్తుంటే అధికార, ప్రతిపక్ష పార్టీలు మాట్లాడుతున్న దాఖలాలు ఎక్కడ చూడలేదని రైతు సంఘం రాష్ట్రఅధ్యక్షుడు పి.రామచంద్రయ్య విమర్శించారు. గురువారం రెవిన్యూ భవన్‌లో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అధ్యక్షతన జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య,జిల్లా కార్యదర్శి జగన్నాథం మాట్లాడుతూ అధికారంలో ఉన్న పార్టీ ప్రతిపక్ష పార్టీలపై హుకుం జారీ చేస్తూ పోలీసుల దాష్టికంతో దాడులకు అక్రమ కేసులకు బనాయించడం, ప్రతిపక్ష పార్టీ మా అధినేత జైలుకు పంపారు అన్యాయం అంటూ ధర్నాలు రాస్తారోకోలు ఆందోళనలు చేయడం తప్ప అయ్యో రాష్ట్రంలో కరువు కాటకాలు సంభవించాయి రైతులకు ఏవిధంగా అండగా నిలవాలని మాట్లాడిన దాఖలాలు, పంట పొలాలను పరిశీలించిన దాఖలాలు ఎక్కడ కూడా చూడలేదని ఇదంతా రాజకీయాలు తప్ప మరొకటి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో ఖరీఫ్ మొదలుకొని నిత్యం రైతుల పట్ల అండగా నిలుస్తూ విత్తనాలు, ఎరువులు నాణ్యమైనవి అందించాలన్నారు. కరువు ఏర్పడ్డ పంట పొలాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చేదాకా పోరాటాలు చేసిన ఘనత తమకే దక్కిందన్నారు. పంట పొలాలను పరిశీలిస్తూ పత్తి ,మిరప ,వేరుశనగ వివిధ రకాల ఎండిన పంటలను సేకరించుకొని తహశీల్దార్ కార్యాలయాలు, వ్యవసాయ శాఖ కార్యాలయాలు మొదలుకొని కలెక్టర్ కార్యాలయం దాకా రైతుల గోడు వినిపించడం ఆందోళనలు తీవ్రస్థాయిలో చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. సీపీఐ, రైతు సంఘం పోరాట ఫలితంగానే కరువు మండలాలుగా ప్రకటించడం జరిగిందని, జిల్లాలో ఆదోని, క్రిష్ణగిరి మండలాలు అత్యంత లోటు వర్షపాతం నమోదయిందని, సంబంధిత అధికారులు నివేదికలు అందజేయడంలో లోపాలు దాగి ఉన్నాయని ప్రభుత్వం తక్షణమే ఈ రెండు మండలాలకు కరువు మండలాలుగా ప్రకటించి తీరాల్సిందేనంటూ డిమాండ్ చేశారు. ఆదోని, క్రిష్ణగిరి మండలాల్లో మధ్యస్థ వర్షపాతం నమోదైనట్లయితే కరువు ఎందుకు ఏర్పడుతుంది కనీసం పెట్టిన పెట్టుబడులకు అయినా దిగుబడులు వచ్చేవి కదా,అదే జరిగి ఉంటే అధిక సంఖ్యలో వలసలు ఎందుకు పోతున్నారు ప్రభుత్వం గమనించాల్సి ఉందన్నారు. ఈ రెండు మండలాలను కరువు మండలాలను ప్రకటించడంతోపాటు నిధులు విడుదల చేసి తక్షణమే సహాయక చర్యలు చేపట్టి వలసలు అరికట్టేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా దినసరి వేతనాన్ని పెంచుతూ పనులు కల్పించాలని కోరారు. డిసెంబర్ మాసంలో రైతు సంఘం జిల్లా మహాసభ జరుగుతుందని, రాజమండ్రిలో జనవరిలో రాష్ట్ర మహాసభలో జరుపుకోవడం జరుగుతుందన్నారు.ఈమహాసభలను జయప్రదం చేసేందుకు రైతులు,సానుభూతిపరులు, రైతు సంఘాల నాయకులు, పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈసమావేశంలో రైతు సంఘం నాయకులు, రైతు సంఘం జిల్లా నాయకులు రాజసాబ్, పంపన్న గౌడు, సీపీఐ మండల కార్యదర్శి కలుబావిరాజు, నియోజక వర్గ అధ్యక్ష కార్యదర్శులు నరసప్ప,ఎల్లప్ప, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, సత్యనారాయణలు పాల్గొన్నారు.

కరువు ప్రాంతంగా ప్రకటించాలి

విశాలాంధ్ర – కర్నూలు : రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జిల్లాలోని కరువు మండలాలుగా ప్రకటించి కర్నూల్ రూరల్ మండలాన్ని ప్రకటించకపోవడాన్ని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ కర్నూల్ రూరల్ లోని అనేక గ్రామాల్లో రైతు వేసిన వేరుశనగ మిరప, ఉల్లిగడ్డ, పొగాకు వరి పంటలు నష్టపోయారని రైతులు దిక్కుతో స్థితిలో వలసలకు వెళ్లారని ఇంత దారుణమైన పరిస్థితి ఉన్నప్పటికీ కర్నూలు రూరల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడం చాలా బాధాకరమైన విషయమని తక్షణమే కర్నూల్ రూరల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

విశాలాంధ్ర– పెద్దకడబూరు : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ రంగప్ప పిలుపునిచ్చారు.గురువారం పెద్దకడబూరు శివారులోని ఏపీ ఆదర్శ పాఠశాలలో పరిశుభ్రతను వ్యవస్థీకృతం చేయడం, శుభ్రత సేవా కార్యక్రమంలో

భాగంగా ఏపీజీబీ మేనేజర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని హితవు పలికారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రంగన్న, ఏపీఓ రామన్న, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బేస్‌బాల్‌కు విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర –గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్లలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో పదో తరగతి అభ్యసిస్తున్న గొల్ల రాజేశ్వరి ఏపీ సీనియర్ బేస్ బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 1న నెల్లూరు జిల్లాలో జరిగిన ఏపీ సీనియర్ బేస్ బాల్ ఎంపికలు జరిగాయి.ఈ ఎంపిక పోటీల్లో కర్నూలు జిల్లా నుంచి ఎమ్మిగనూరు మండలం రాళ్లదొడ్డికి చెందిన క్రీడాకారిణి గొల్ల రాజేశ్వరి ఎంపికైంది. ఈనెల పంజాబ్ రాష్ట్రంలో జరుగుతున్న సీనియర్ బేస్‌బాల్ పోటీల్లో ఏపీ జట్టు నుంచి రాజేశ్వరి పాల్గొననుంది. జాతీయస్థాయిలో రాణించి గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని గ్రామస్థులు అభినందించారు.

పీఎం బీమా యోజన పథకం సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర –కర్నూలు సిటీ: ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాన్ని

ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కర్నూలు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్ పర్సన్ ఎస్వీ విజయ మనోహరి కోరారు. గురువారం కేడీసీసీ బ్యాంకు చైర్మన్ చాంబర్‌లో ఇంటింటికి సహకారం– సహకార సమైక్య డిపాజిట్ పోస్టర్ ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్వీ విజయ మనోరి మాట్లాడుతూ 18 నుంచి 70 ఏళ్లలోపు వారికి జిల్లా కేంద్రసహకార బ్యాంకులలో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాన్ని ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. అర్హులందరికీ ఉచిత ఖాతాతో పాటు రూపే డెబిట్ కార్డు, భీమా మొత్తాన్ని బ్యాంకులు చెల్లిస్తాయన్నారు. ఈఅవకాశాన్ని ఉమ్మడి కర్నూలుజిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.కార్యక్రమంలో సీఈవో పి.రామాంజనేయులు డీజీఎంలు డైరెక్టర్లు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తా చాటిన అశోక్ ఉమెన్స్ కళాశాల విద్యార్థులు

విశాలాంధ్ర– కర్నూలు లీగల్ : జేఎన్టీయూ ఇంటర్–యూనివర్సిటీ 'కబడ్డీ టీమ్'కు ఎంపికైన 'అశోకా' స్టూడెంట్స్ సత్తా చాటిన 'అశోకా'కళాశాల విద్యార్థినిలు సెకండ్ ఇయర్ స్టుడెంట్స్ ఏ.నేహ, సి ఎస్ ఈ–ఏ 1 , జె.నాగప్రవల్లిక,సౌత్ జోన్ ఇంటర్–

యూనివర్సిటి 'కబడ్డీ' పోటీలలో సత్తాచాటనున్న 'అశోకా' క్రీడాకారిణిలు అశోకా' స్టూడెంట్స్‌ని అభినందించిన ఛీఫ్ గెస్ట్ బి.జోజిరెడ్డి జేఎన్టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ) కర్నూలు నగరంలోని 'అశోకా' ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజ్ కి చెందిన బి.టెక్ సెకండియర్ స్టుడెంట్స్ ఏ.నేహ,జీ.నాగప్రవల్లిక, 'కబడ్డీ' క్రీడలో ఉత్తమ ప్రతిభను చాటుకున్నారు. జేఎన్‌టియుఏ ఇంటర్–వర్సిటీ 'కబడ్డీ టీమ్'కు ఎంపికైనట్లు 'అశోకా' కాలేజ్ ప్రిన్సిపాల్ డా.ఆర్.నవీన్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 'జేఎన్టీయూఏ–అనంతపురం' ఆధ్వర్యంలో ఈనెల 1న బుధవారం తిరుపతిలోని 'శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజ్'లో నిర్వహించిన'కబడ్డీ'ఇంటర్ యూనివర్సిటీ 'ఉమెన్స్ టీమ్' సెలక్షన్స్ లో మన 'కర్నూలు'కి చెందిన 'అశోకా' ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజ్ కి చెందిన బి.టెక్ సెకండియర్ స్టూడెంట్ స్ ప్రతిభ కనబరిచారు. ఇంటర్–యూనివర్సిటీ 'కబడ్డీ టీమ్'కు ఎంపికయ్యారని తెలిపారు.

మంచినీటి సమస్య తలెత్తనివ్వం..!

విశాలాంధ్ర – చిప్పగిరి: మండల కేంద్రమైన చిప్పగిరిలో ఎలాంటి మంచి నీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని సర్పంచ్ దాసరి గోవిందరాజులు అన్నారు. గురువారం చిప్పగిరి లోని మంచినీటి ట్యాంకు వద్ద నీటి పైపులైను మరమ్మత్తు పనులను పరిశీలించారు. ఈసందర్భంగా గోవింద రాజులు మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసే సమయంలో మంచినీటి పైపులైన్లు దెబ్బతినడం జరిగిందన్నారు. దీంతో కొంత మేర మంచినీటి సమస్య తలెత్తినప్పటికీ తక్షణమే సమస్యను పరిష్కరించేకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీలో కొన్ని పనులు జరుగుతున్నాయని, ఆ పనులు జరగాలంటే విద్యుత్ అవసరమని అలాంటప్పుడు విద్యుత్ అధికారులు పంచాయతీకి ముందస్తు సమాచారం ఇస్తూ విద్యుత్‌ని నిలిపివేయాలని ఆయన తెలియజేశారు.

కర్నూలును కరువు జిల్లా ప్రకటనను స్వాగతిస్తున్నాం

విశాలాంధ్ర : కోడుమూరు : రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి నందుకు సీపీఐ,రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ చర్యలను స్వాగతిస్తున్నామని రైతు సంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథం అన్నారు.గురువారం ఆయన స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ రాష్ట్ర నాయకుల పిలుపుమేరకు సీపీఐ రైతు సంఘం పోరాట ఫలితమే కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించడం జరిగిందన్నారు. అయితే ప్రతియేటా కరువు జిల్లాలుగా ప్రకటిస్తున్నారే కానీ,రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఈ ఏడాది రాష్ట్రంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కరువు పరిస్థితులను అంచనా వేసి,రైతులు వేసిన కొర్రలు, సద్ద

లు,ఆముదాము వంటి పంటలకు ఎకరాకు రూ.50వేలు, పత్తి,మిరప,ఉల్లి తదితర పంటలకు ఎకరాకు రూ.లక్ష దాకా పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.బ్యాంకులో రుణం తీసుకున్న ప్రతిరైతుకు అన్నిరకాల రుణమాఫీ చేయాలని అంతేకాకుండా రైతులందరికీ ఇన్సూరెన్స్ వర్తింపచేయాలని తెలిపారు.రాబోయే ఖరీఫ్ సీజన్ కు 90 శాతం సబ్సిడీ కింద విత్తనాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాలలో రైతులు కూలీలు వలసలు వెళ్తున్నారని,వలసలు వెళ్లకుండా నివారించాలని, వెంటనే గ్రామీణ ఉపాధి పనులను చేపట్టాలని కోరారు.పశువులు, గొర్రెలకు మేత ప్రభుత్వమే అందించాలని, అడవిలో మూగజీవాలకు నీరు తాగడానికి బోర్లువేసి నీటిగుంటలు ఏర్పాటు చేసి, వాటికి నీరు అందించేలాగా ప్రభుత్వమే చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు.పేరుకు మాత్రమే కరువు జిల్లా ప్రకటించి చేతులు దులిపేసుకుంటే సహించేది లేదన్నారు.తక్షణమే జిల్లాలో ఉన్న మండలాలలో కరువు సహాయక చర్యలను చేపట్టాలని రైతు సంఘం భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నామన్నారు. కరువు సహాయక చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తు ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి రాజు, పట్టణ కార్యదర్శి రాముడు,కర్నూలు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శివరాములను పరామర్శ

విశాలాంధ్ర –ఆదోని రూరల్ : మండలంలోని విరుపాపురం గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ శివ రాములు హార్ట్ బైపాస్ సర్జరీ చేసుకోవడంతో తన నివాసంలో విశ్రాంతి ఉండగా సమాచారంతెలుసుకున్న సీపీఐ రాష్ట్ర

కార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య, సీపీఐ బృందంతో వెళ్లి పరామర్శించారు. శివరాములు మాటకు కట్టుబడే విలువలతో కూడిన పోరాటాలు చేసేవారని, పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ ప్రజానాట్యమండలి బాధ్యతలను అప్పజెప్పడం జరిగింది. శివరాములు ఆరోగ్యదృష్ట హాట్ బైపాస్ సర్జరీ చేసుకొని విశ్రాంతి పొందుతున్నారు. త్వరగా కోలుకొని ఆయన సేవలు సీపీఐ, ప్రజానాట్యమండలికి ఎంతో అవసరమనే రామచంద్రయ్య కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథం,మండల కార్యదర్శి కల్లుబావిరాజు, తిమ్మయ్య,రాజా సాబ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార, గృహ నిర్మాణదారులకు చేయుత

విశాలాంధ్ర– కర్నూలు సిటీ: ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో గృహ నిర్మాణదారులకు చేయూత అందించేందుకు సిరీస్ ఏ లో భాగంగా ఎలివేషన్ క్యాపిటల్ నుండి రూ.150 కోట్లను సమీకరించినట్లు వృద్ధి హెూం ఫైనాన్స్ ఎండి, సీఈవో సుంకు రామ్ నరేష్ పేర్కొన్నారు. గురువారం సహ వ్యవస్థాపకులు సందీప్ అరోరా, చీఫ్ ఫైనాన్షియల్ అధికారి సునీల్ మెహతాతో కలిసి ఆయన ప్రకటన విడుదల చేశారు. బెంగళూరు కేంద్రంగా 2022లో వృద్ధి హెూం ఫైనాన్స్ ప్రారంభించామన్నారు. అనతి కాలంలోనే వినియోగదారులకు రూ.8–10లక్షల పరిమాణంలో గృహరుణాలు పొందడంలో సహకారాన్ని అందించామని వెల్లడించారు. భారతదేశంలోని చిన్న, మధ్య తరహా నగరాల్లో వేతనాలు, స్వయం ఉపాధి పొందుతున్న వారందరికీ సేవలందిస్తూ వారి జీవితాల్లో సరికొత్త కాంతులు నింపడమే లక్ష్యంగా ముందుకెళ్తూతున్నామన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు,తిరుపతి, నెల్లూరు,హిందూపురం, మదనపల్లె, అనంతపురంలో తమశాఖలు ఇప్పటికే విస్తరించాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో సెమీ–అర్బన్, గ్రామీణ ప్రాంతాలకు యాక్సెస్ ను విస్తరించేందుకు వృద్ధి ఫైనాన్స్ సంస్థ ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు.

కరువు మండలంగా ప్రకటించాలి

విశాలాంధ్ర –క్రిష్ణగిరి : క్రిష్ణగిరి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి, సర్పంచ్ రవి మోహన్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఎండిపోయిన పంటతో ఆయన ఫిర్యాదు చేశారు. ఎంపీ

డీవో విశ్వమోహన్ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా మండల అధ్యక్షులు వెంకటరామిరెడ్డి,జడ్పిటిసి కేఈ సుభాషిని ఆయాశాఖల మండలఅధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. 3 నెలల సంబంధించిన అభివృద్ధి నివేదికలను అన్ని శాఖల అధికారులు చదివి వినిపించారు. బోయబొంతిరాళ్ళ సర్పంచ్ రవిమోహన్ మాట్లాడుతూ బోయబొంతిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఆయన ఫిర్యాదు చేశారు. సర్పంచ్ తీర్మానం లేకుండానే అభివృద్ధి పనులు చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని అధికారులు కూని చేస్తున్నారన్నారు. రామ కృష్ణాపురంలో ఓవ్యక్తి పొలాన్ని మరోవ్యక్తికి ఆన్‌లైన్ చేశారని రెవిన్యూ అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదన్నారు. ఈవిషయంపై ఎంపీపీ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేందుకు తీర్మానం ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. బొంతిరాళ్లలో ఎంపీ, ఎంపీపీ నిధుల కింద బోర్లు వేసిన వాటికి పైపు కనెక్షన్లు ఇచ్చి తాగునీటి సమస్య తీరుస్తామని ఆయన హామీ ఇచ్చారు. రామకృష్ణాపురంకు చెందిన పొలం సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు.

విద్యాసంస్థల బంద్‌కు స్వచ్ఛందదంగా తరలిరావాలి

గోడపత్రిక ఆవిష్కరణలో పిలుపునిచ్చిన విద్యార్థి,యువజన సంఘాల నేతలు

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం జరుగుతున్న ఉద్యమంలో భాగంగా ఈనెల 8న జరిగే విద్యాసంస్థల బంద్‌లి విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి యువజన సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీఆర్ భవన్‌లో విద్యాసంస్థల బంద్‌కు సంబంధించిన గోడపత్రిక ఆవిష్కరించారు. ఏఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షులు సోమన్న, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేశ్ , వి డి ఎస్ య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అఖండ మహేంద్ర, జిల్లా అధ్యక్షులు రఫీలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుతోనే రాయలసీమ యువతకు ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా వెనకబడిన సీమ జిల్లాల అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కడప ఉక్కు పరిశ్రమ విభజన హామీల్లో భాగంగా ఉంది కాబట్టి కేంద్ర ప్రభుత్వమే నిధులు వెచ్చించి కడపలో ఉక్కు పరిశ్రమ స్థాపన కోసం కృషి చేయాలన్నారు. ఆదిశగా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అధికార వైసీపీ ప్రభుత్వం, ప్రతిపక్ష టీడీపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కృషి

చేయాలన్నారు అధికార వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వపై ఒత్తిడి లేకపోవడం, తన కేసుల నుండి బయటపడడానికి ప్రభుత్వానికి దాసోహం అవడంతో ఇష్టానుసారంగా ఇక్కడ పరిశ్రమలను ప్రైవేట్ పరం చేస్తూ ఏపీ యువతకు ఉపాధి అవకాశాలను దూరం చేస్తుందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్రం మెడలు వంచి ఉక్కు పరిశ్రమ సాధించుకోవడం కోసం, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఈనెల 8న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు బందుకు పిలుపునిచ్చినట్లు స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలు, విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు, యువకులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఏఐవైఎఫ్ నాయకులు బిసన్న, బాబయ్య ఏఐఎస్ఎఫ్ నాయకులు చంటి, అశోకు, శివకుమార్, ఎస్ఎఫ్ఐ పిడిఎస్ యు, డివైఎఫ్ఐ, నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ పోరాట ఫలితమే కరువు మండల ప్రకటన

విశాలాంధ్ర–పెద్దకడబూరు : సీపీఐ, రైతు సంఘం పోరాటాల ఫలితంగానే పెద్దకడబూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించారని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం తాలూకా కార్యదర్శి ఆంజనేయ అన్నారు. గురువారం మండల కేంద్రమ్కైన పెద్దకడబూరులోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు వేసిన పంటలు పండక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇంత జరిగినా ఒక్క అధికారి గానీ, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు, కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని,పెద్దకడబూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో పలుఉద్యమాలు చేయడం జరిగిందన్నారు. ఉద్యమాల ఫలితంగానే జిల్లాను, పెద్దకడబూరు మండలాన్ని కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. కరువు మండలంగా ప్రకటించడమే కాదు తప్పనిసరిగా కరువు సహాయ చర్యలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏదిఏమైనా పెద్దకడబూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినందుకు సీపీఐ, రైతుసంఘం తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు తిక్కన్న, హనుమంతు, హయాత్ పటేల్, గోపాల్, నర్సింహులు, చంద్ర, ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు జాఫర్ పటేల్‌లు పాల్గొన్నారు.

మహా పడావును జయప్రదం చేయండి

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలు నిరసిస్తూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర చెల్లించాలని, స్వామినాథన్ సిఫారసు అమలు సిఫారసులు అమలు చేయాలని విద్యుత్ సంస్కరణలను ఆపాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్ప కోరారు. గురువారం ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, రైతన్న పోరాటం సందర్భంగా రైతులను వాహనంతో తొక్కించి చంపినటువంటి బిజెపి ఎంపీ కొడుకును అరెస్టు చేయాలని ప్రధాన డిమాండ్లతో నవంబర్ 27, 28 తేదీలలో కార్మిక సంఘాలు రైతు సంఘాలు తలపెట్టిన మహా పడావు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో కార్మిక రైతు సంఘాల సమావేశం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ము నెప్ప అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి నగర కార్యదర్శి చంద్రశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఎస్ రాధాకృష్ణ,అంజిబాబు, ఐఎన్‌టిసి జిల్లా కార్యదర్శి బతకన్న ,ఎస్

యు సి ఐ జిల్లా కార్యదర్శి నాగన్న, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి నాగన్న, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథం, కేతవరం రామకృష్ణ, రైతుకూలి సంఘం నాయకులు వెంకటేష్, వెంకటస్వామిలు హాజరై ప్రసంగించారు. ఈనెల 6న జర్నలిస్టులపై ప్రజాతంత్ర వాదులపైన కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా ధర్నాలు నిర్వహించాలని, 7న ఉదయం 10 గంటలకి కర్నూలులోని ఎస్టీయూ భవన్‌లో జిల్లా సదస్సు నిర్వహించాలని తీర్మానించడం జరిగింది. ఉద్యోగ కార్మిక రైతులు రైతు సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆగని వలసలు పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర– హెూళగుంద : మండలంలోని కొత్తపేటలో గురువారం 70 కుటుంబాల మంది సంగారెడ్డి జిల్లాకు వలస వెళ్లారు .వర్షాలు లేక ఉపాధి పనులు జరగక ఉపాధి దొరకక ప్రజలు వలస బాట పట్టారు .ఇప్పటికే హెూళగుంద, గజ్జహళ్లి, చిన్నహ్యాట తదితర ప్రాంతాల నుండి ప్రజలు భారీ సంఖ్యలో వలస వెళ్లారు. పిల్లా పాపలతో నెత్తికెత్తుకుని వలస వెళ్లారు.ఇంటి వద్ద వృద్ధులను విడిచిపెట్టి బోరున విలపిస్తూ వలస వెళ్లి కూలీలకు బంధుమిత్రులు జాగ్రత్త అంటూ వీడ్కోలు పలికారు .జనం రద్దీతో కిటకిటలాడే పల్లెలు అధిక సంఖ్యలో ప్రజలు వలస వెళ్లడంతో జనం లేక వెలవెల పోతున్నాయి.మండలంలో రోజు వలసల బండిలు తరలిపోతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని సీపీఐ మండల కార్యదర్శి పెద్దహట మారెప్ప ఆరోపించారు .కరువు మండలంలో అధికారులు

ప్రకటించిన ప్రజలకు ఉపాధి కరువైందని జిల్లా కలెక్టర్ డ్వామ పిడి చర్యలు తీసుకొని ప్రజలు వలస పోకుండా అరికట్టాలని ప్రజలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

పోలింగ్ స్టేషన్‌లన్నింటిని పరిశీలించండి

విశాలాంధ్ర బ్యూరో –కర్నూలు : ప్రతి పోలింగ్ స్టేషన్ను పరిశీలించాలని, ఈ నెల 4,5, డిసెంబర్ 2,3 తేదీల్లో నిర్వహించనున్న స్పెషల్ క్యాంపెయిన్ల గురించి ప్రజలకు తెలిసేలా చర్యలు చేపట్టాలని ఈఆర్ఓ, ఎఈఆర్ఓలను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అదేశించారు. గురువారం ఉదయం జిల్లాఅధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్‌లు, ఎంపీడీఓలు, తదితరులతో ఎన్నికలు, రీ –సర్వే, హౌసింగ్, తదితర అంశాలపై కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ స్టేషన్ పరిశీలించి వాటిలో ఏవైనా సమస్యలుంటే వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఈఆర్ఓ, ఎఈఆర్ఓ లను కలెక్టర్ ఆదేశించారు. డిసెంబర్‌లో కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులచే ఎన్నికల సంసిద్ధతపై సమీక్ష నిర్వహించనున్న సందర్భంగా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఓటర్ల ముసాయిదా జాబితాకి సంబంధించి అనామలిస్, జంక్ క్యారెక్టర్స్‌కి సంబంధించి ఏమైనా అర్జీలు వచ్చిన వాటిని వెంటనే పరిష్కరించే దిశగాచర్యలు తీసుకోవాలని ఈఆర్ఓ, ఎఈఆర్ఓ లను కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 4,5, డిసెంబర్ 2,3 తేదీల్లో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.అన్ని పోలింగ్ స్టేషన్ లను పరిశీలించే దిశగాచర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు చర్యలు

విశాలాంధ్ర –ఆస్పరి : రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి వారికి పూర్తి స్థాయిలో పౌష్టికాహారం, అవసరమైన మందులు అందించి రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య జిల్లా అధికారిని హేమలత అధికారు

లను ఆదేశించారు. గురువారం కేజీబీవీ పాఠశాలలోనే విద్యార్థినీలకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పోషకాహార లోపంతో రక్తహీనత గురై అనారోగ్యం పాలవుతున్నారన్నారు. తద్వారా వారిలో నీరసం, నిస్సత్తువ పెరిగి చదువులో వెనుకబడుతున్నారన్నారు. ప్రభుత్వం వారు ఐరన్ మాత్రమే వారానికి ఒకటి చొప్పున వేయించేలా చర్యలు చేపట్టిందని, అందులో భాగంగా ప్రతి గురువారం విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో ఎవరికి ఐరన్ లోపం లేకుండా మాత్రల పంపిణీ పక్కాగా జరగాలని అధికారులను ఆమె ఆదేశించారు.కార్యక్రమంలో డాక్టర్ రఘురాంరెడ్డి, కేజీబీవీ పాఠశాల ఎస్ఓ సారన్ స్మైలీ, పబ్లిక్ హెల్త్ నర్స్ రామంజినమ్మ, సూపర్వైజర్ లక్ష్మీకాంతమ్మ, ఏఎన్ఎం లు, ఎంహెచ్.పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసులు పెడితే భయపడే ప్రసక్తే లేదు

విశాలాంధ్ర –కర్నూలు లీగల్ : అక్రమ కేసులు బనాయించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పాణ్యం మాజీ శాసనసభరాలు గౌరు చరితారెడ్డి తన స్వగృహం ఎదుట ప్లే కార్డు పట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలుగా కల్తీ నాసిరకమైన మద్యం అమ్మి లక్ష కోట్లు దోచుకున్న జగన్‌రెడ్డి చంద్రబాబు బాబు హాయంలో మద్యం కుంభకోణం జరిగిందంటూ కేసు పెట్టడం హేయమైన చర్యన్నారు. నారా చంద్రబాబు,మాజీ మంత్రి కొల్లు రవీంద్ర పై తప్పుడు కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ బీసీల ద్రోహిజగన్ అంటూ నిరసన తెలియచేశారు. ఈకార్యక్రమంలో నంద్యాల పార్లమెంటు మహిళ అధ్యక్షురాలు కే పార్వతమ్మ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్ , బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేశ్ గౌడ్,జిల్లా కోశాధికారి పియూ మాదన్న,అర్బన్ నాయకులు ధనుంజయ, బీవీ చంద్ర, బివియన్ రాజు యాదవ్, వీజీ వెంకటేష్,మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కల్లులో మోతాదుకు మించి మత్తు పదార్థాలు

తాగితే వాంతులు, విరేచనాలు.. కీళ్లనొప్పులు

చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

విశాలాంధ్ర– నందికొట్కూరు: బహిరంగ మార్కెట్ లో లీటరు నీళ్లు రూ.5 నుంచి రూ. 10 ఉంటుంది. చక్కెర కీలో రూ.15 వరకు వుంది.అలాంటిది కేవలం రూ.5 లకే సీసా కల్లు అమ్మడం సాధ్యమేనా. అంటే సాధ్యమే అంటున్నారు నాగటూరు ప్రజలు. నాగటూరు గ్రామంలో రూ.5లకే సీసా కల్లు దొరుకుతుంది.ఈకల్లు తాగిన వారు వాంతులు, విరేచనాలు, కీళ్ళ నొప్పులతో బాధపడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తూ కూర్చోవడం పై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.నందికొట్కూరు ఎక్సైజ్ పరిధిలో కల్తీకల్లు వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతోంది. కల్తీకల్లు అమ్మకాలతో పేదల జీవితాలతో దుకాణాల నిర్వాహకులు ఆటలాడుతున్నారు. సాధారణ కల్లుతో మత్తు రావడం లేదని కొందరు ఎక్కువ మత్తిచ్చే ఆల్కహాల్ లిక్కర్‌కు అలవాటు పడ్డారు. దీంతో కల్లు అమ్మకాలు తగ్గాయి. దీంతో కల్లు వ్యాపారులు లిక్కర్ కంటే ఎక్కువ మత్తు ఇచ్చేలా వివిధ రసాయనాలు వేసి కల్తీకల్లు తయారు చేస్తున్నారు. సాధారణ లిక్కర్‌తో పోలిస్తే కల్తీకల్లు రేటు తక్కువ ఉండడంతో పేదలు కల్తీకల్లుకు అలవాటు పడుతున్నారు. కల్తీ కల్లు తాగితే నాడీ మండల వ్యవస్థ, నరాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అది దొరకకుంటే మతి స్థితిమితం తప్పిన వారిలా ప్రవర్తిస్తుంటారు.పలువురు నాసిరకం మద్యం, కల్తీ కల్లును తాగిరోగాల బారిన పడ్డారు. కల్లులో మోతాదుకు మించి మత్తు పదార్థాలు ఉండటంతో పలువురు మూర్ఛతో బాధపడుతున్నారు. వ్యాపారులు నిషేధిత పదార్థాలతో కల్తీకల్లు తయారు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.మండలం లోని నాగటూరులో కల్లు దుకాణం యజమాని రూ.5లకే సీసా కల్లు అమ్ముతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఎక్కడ లేని విదంగా ఇక్కడ మాత్రమే రూ.5 లకు సీసా కల్లు దొరుకుతుంది. అసలు ఈకల్లు మంచిదా లేక కల్తీకల్ల అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. కల్లులో మత్తు ఎక్కించే క్లోరోహైడ్రేట్, డైజోఫాం, సిల్వర్‌యాష్, కట్టామీటా, సిల్వర్ నైట్రేడ్‌ల తదితర మత్తు పదార్థాలు కలువుతున్నట్లు సమాచారం.అధికారులు కల్తీవ్యాపారాన్నిచూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు దుకాణం యజమానిని హెచ్చరించిన అధికార పార్టీ నాయకుల అండతో అధికారుల ఆదేశాలను పట్టించుకోవడం లేదని విశ్వసనీయ సమాచారం.ఎక్సైజ్ శాఖ,సెబ్, ఎక్సైజ్ విజిలెన్స్ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నారు. ఏదేని సంఘటన జరిగినప్పుడు మాత్రమే దాడులు చేసి వదిలేస్తున్నారనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. ఎక్సైజ్ శాఖకు జిల్లా స్థాయిలో మాత్రమే కార్యాలయం ఉండడంతో కల్లు దుకాణాలపై పర్యవేక్షణ కొరవడింది. సెబ్, ఎక్సైజ్ విభాగాలుగా విడిపోవడంతో అధికారుల మధ్య సమన్వయ లోపం నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

విశాలాంధ్ర –ఆస్పరి : రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క వైసిపి కార్యకర్తలు, గృహసారథులు, కన్వీనర్లు పనిచేయాలని మంత్రి సోదరుడు వైయస్సార్సీపీ తాలూకా ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సుంకర ఉమాదేవి భర్త రామాంజనేయులు అధ్యక్షతన మా నమ్మకం నువ్వే జగన్.. ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలి అనే అంశంపై సమావేశాన్ని నిర్వహించారు.ఈసమావేశానికి ముఖ్య అతిథులుగా వైసిపి తాలూకా ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి పాల్గొని మాట్లాడుతూ 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' అన్నది జన నినాదం. సంక్షేమ, అభివృద్ధి పాలనపై ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయం సేకరించి బుక్‌లెట్ ఓటు ద్వారా వివరాలను నమోదు చేయాలని సూచించారు. అధికారంలో ఉంటూ పాలనపై ప్రజాభిప్రాయాలు తెలుసుకోవడం దేశచరిత్రలో ఇదే తొలిసారి.. రాజకీయాలు, కుల, మత, వర్గాలకు అతీతంగా, అవినీతి రహితంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేయడం వల్లే ప్రజల సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నారని స్పష్టంచేశారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడానికి అందరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వానికి అండగా ఉండి పని చేయాలన్నారు. జడ్‌పీటీసీ దొరబాబు, సొసైటీ చైర్మన్ గోవర్ధన్, జిల్లా కేడీసీసీ డైరెక్టర్ రాఘవేంద్ర, ఆస్పరి, ఆలూరు వైసీపీ కన్వీనర్లు పెద్దయ్య, వీరేష్, నాయకులు, గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

విశాలాంధ్ర –చిప్పగిరి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఓటర్ల జాబితా సవరణకై ప్రతిఒక్క రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని మండల తహసీల్దార్ లక్ష్మీనారాయణ రాజకీయ పార్టీ నాయకులను కోరారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై సమావేశాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా తహశీల్దార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జాబితా సవరణకై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాబితా తయారీకి సిద్ధమవడం జరిగిందన్నారు. కనుక గ్రామాల్లోని బి ఎల్ వో లు పోలింగ్ బూత్ కేంద్రాల ప్రకారం ఇంటింటికి తిరిగి ఓటర్లు జాబితాలోని పేర్లు నమోదు కానీ వారి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. సవరణ చేసిన ఓటర్ల జాబితా పై ఏవైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని అనవసరమైన ఫిర్యాదులు రాకూడదనే ఉద్దేశంతోనే ఓటర్లు అన్ని రాజకీయపార్టీ నాయకులకు అందజేయడం జరిగిందన్నారు. రాజకీయపార్టీ నాయకులు సలహాలు సూచనలు చేస్తే వాటిని పరిగణములోకి తీసుకుంటామన్నారు. ఆలూరు మార్కెట్‌యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, మండల వైసీపీ కన్వీనర్ జూటూరు మారయ్య, టిడిపి మండల మాజీ జడ్పిటిసి సభ్యులు ఏరూరు మీనాక్షి నాయుడు, టిడిపి మండల కన్వీనర్ రాయచూరు షేక్షావలి, మాజీ మండల ఉపాధ్యక్షులు వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులను కలిసి పరామర్శ

విశాలాంధ్ర– ఆత్మకూరు టౌన్: పట్టణంలోని రాజా వీధిలోని మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్త శేషఫణిని వారి స్వగృహం నందు మర్యాదపూర్వకంగా శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి కలిశారు. పట్టణంలో ని శ్రీరామ్ నగర్ కాలనీ లో ప్రముఖ వైద్యులు, మాజీ ఎంపిపి డా. మహేశ్వరయ్య ను వారి స్వగృహం నందు మర్యాదపూర్వకంగా కలిసి మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పరామర్శించారు. పట్టణంలోని వీరభద్ర కాలనీలో అర్చన, అరుణ మెడికల్ స్టోర్స్ యజమాని డి. రామ సుబ్బయ్యను వారి స్వగృహం నందు మర్యాదపూర్వకంగా శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి కలిశారు. పట్టణంలో ప్రముఖ వైద్యులు డా.గౌరినాథ్ ని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి కలిశారు. పట్టణంలోని లింగాయత్ వీధిలో డా. రషీద్ ను మర్యాదపూర్వకంగా వారి స్వగృహం నందు శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి కలిశారు.

వైసీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర– క్రిష్ణగిరి : వైసీపీ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం మండల పరిధిలోని తోగర్చేడు లో రూ.82.50 లక్షలతో చేపట్టిన సచివాలయం, రైతు భరోసా, వైయస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాలు రైతులకు, ప్రజలకు ఎంతో దోహదపడు తున్నాయన్నారు. సంక్షేమ పథకాలు నిరుపేదలకు వరంగా మారాయని ఆమె అన్నారు. రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు వెళుతుంటే ప్రతిపక్ష నాయకులు ఓర్వలేక బురదజల్లుతున్నారన్నారు. అభివృద్ధికి సహకరించాలి తప్ప అడ్డు పడడం సరైనది కాదన్నారు.కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెంకట రామిరెడ్డి, జెడ్పిటిసి కేశ సుభాషిని, ఎంపిటిసి బోయ సుశీల సింగల్ విండో అధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి, వైసీపీ కార్యకర్తలు మాధవరావు, దస్తగిరి, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

మండలాన్ని కరువు మండలంగా చేస్తాం..

క్రిష్ణగిరి, తుగ్గిలి మండలాలను కరువు మండలంగా చేస్తామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా కలెక్టర్ తో, వ్యవసాయ శాఖ మంత్రితో మాట్లాడినట్లు ఆమె తెలిపారు. తప్పకుండా రెండు మండలాలను కరువు మండలాలుగా తీసుకొస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

పేదవాడి ఆరోగ్యమే జగనన్న లక్ష్యం



విశాలాంధ్ర - నంద్యాల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, వైసీపీ ప్రభుత్వం పేదవాడి ఆరోగ్యంపై చిత్త శుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్ఆర్ నగర్‌లో స్థానిక కౌన్సిలర్ సావిత్రమ్మ, వార్డు ఇంచార్జ్ రమణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు హాజరై పేద ప్రజల యొక్క ఆరోగ్య రక్షణకు బిపి, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, తదితర రోగాలకు వివిధ రకాల పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను, కంటి అద్దాలను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా, వైస్ చైర్మన్ లు గంగిశెట్టి శ్రీధర్, పామ్ షావలి, ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, నాయకులు, సాయిరాం రెడ్డి, జయప్రకాష్ సచివాలయ ఉద్యోగులు స్పెషలిస్ట్ వైద్యులు, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

హిందూ సమ్మేళనం విజయవంతం చేయండి

విశాలాంధ్ర –బనగానపల్లె: సమరసత సేవా ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ వారి

ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో హిందూ సమ్మేళనాలు జరపాలని నిర్ణయించారని అందులో భాగంగా బనగానపల్లి మండల కేంద్రంలో గల బి.వి సుబ్బారెడ్డి ఫంక్షన్ హాల్ నందు ఈనెల 11వ తేదీ శనివారం ఉదయం 9–00 హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ టి మాధవరెడ్డి తెలియజేశారు. పట్టణంలోని కొండపేట లో గల పెద్ద ఆంజనేయ స్వామి దేవాలయం నందు హిందూ సోదరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ ఈ హిందూ సమ్మేళనంలో భజన సంఘాలు, వివిధ కళాకారులు, కుల పెద్దలు, గ్రామ పెద్దలు పాల్గొనాలని విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశం, వివిధ ధార్మిక సంఘాల సమావేశం, పూజ్య స్వామీజీల ప్రసంగాలు, నగర సంకీర్తనలు ఉంటాయి అన్నారు. సమావేశంలో సబ్ డివిజన్ కన్వీనర్ ఎ.శివరామిరెడ్డి, జిల్లా ధర్మ ప్రచారక్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ శంకరయ్య, సహ కన్వీనర్లు బి నాగ మల్లారెడ్డి, బాల వెంకటేశ్వర్లు, గోపాల్ రెడ్డి, జమ్మయ్య లతోపాటు మండల కమిటీ సభ్యులు, గ్రామ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిని కరువు మండలంగా ప్రకటించాల్సిందే

విశాలాంధ్ర –ఆదోని రూరల్ : వరుస కరువు కాటకాలతో అలమటిస్తున్న అన్నదాతను ఆదుకోవడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని టీడీపీ నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ గుడిసి కృష్ణమ్మ ఆగ్రహ వ్యక్తం చేశారు. గురువారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విలేకరులతో మాట్లాడారు. వర్షాలు లేక అధిక పెట్టుబడులు పెట్టి అప్పుల పాలైన అన్నదాతల గాథ అధికారులకు పాలకులకు పట్టదు ఆమె ప్రశ్నించారు. ఆదోని మండలంలో 31,497 ఖరీఫ్ సీజన్లో సాగు చేయడం జరిగిందని అకాల వర్షాలతో ఊరటనిస్తూ పత్తి మిరప వేరుశనగ కంది ఆముదం వంటి వివిధ రకాల పంటలకు ఎకరానికి లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి అప్పులు పాలై వలస బాట పడుతుంటే మధ్యస్థ వర్షపాతం నమోదయిందని ప్రభుత్వం ప్రకటించడం సిగ్గుచేటు అన్నారు. ఆదోని డివిజన్లో అన్ని మండలాలను తీవ్రమైన కరువు మండలాలుగా ప్రకటిస్తే డివిజన్ కేంద్రమైన ఆదోని మండలం ఏమి పాపం చేసిందంటూ మండి పడ్డారు. ఆదోని ఏరియా డెవలప్మెంట్ అథార్ కమిటీ నియమించారు తప్ప ఒరిగేది ఏమీ లేదన్నారు. ఈఏడాది అక్టోబర్‌లో 90% తక్కువ వర్షపాతం నమోదు కావడం 70 సంవత్సరాలలో ఇదే తొలిసారని తెలియజేశారు. ఆదోని మండలం కరువు మండలంగా లేకపోయినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే ఎందుకు నోరు మెదపడం లేదని, రైతులు బాగుపడితే తమకు మాట వినరని ఏమైనా సందేహం నెలకొంది అంటూ ఆమె పాలకపక్షపు విమర్శలు వర్షం గుర్తించారు. ఏదేమైనప్పటికీ ఆదోని ప్రాంతంలో రైతాంగాన్ని కాపాడాలంటే కరువు మండలంగా ప్రకటించి తీరాల్సిందేనంటూ ఆమె డిమాండ్ చేశారు. సమావేశంలో వడ్డేమాన్ గోపాల్,మాజీ ఎంపీపీ మురళి, రాఘవరెడ్డి,సాదిక్ వలి, బాబురావు,లక్ష్మి కాంత్ రెడ్డి, భరత్ కుమార్,చిరంజీవి పలువురున్నారు.

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర –ఆత్మకూరు టౌన్ : స్థానిక మార్కెట్ యార్డులో ఇంద్రానగర్ సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యకమాన్ని ఆరోగ్యశాఖ సిబ్బందితో మమేకమై ఎమ్మెల్యే శిల్ప చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం దేశానికి ఆదర్శమని, ఇతర రాష్ట్ర ప్రజా ప్రతినిధులు మన రాష్ట్ర పథకాలను ఆదర్శంగా తీసుకొని అమలు చేస్తున్నారని ఈరోజు నిరుపేద కుటుంబాలలో వైద్యం కొరకు చాలా డబ్బును ఖర్చు చేస్తున్నారు కానీ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు.జగనన్న ఆరోగ సురక్ష కార్యక్రమం ద్వారా చాలా రకాల టెస్టులు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సచివాలయం పరిధిలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఎమ్మెల్యే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో వివిధ రకాల స్టాల్స్ ను, పంపిణీ చేస్తున్న మెడిసిన్స్ ను స్వయానా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ జడ్పిటిసి సభ్యులు, ఆత్మకూరు వైఎస్ఆర్ పార్టీ మండలం, టౌను అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల ప్రజా ప్రతినిధులు, వార్డు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ పరిధిలోని ప్రజలు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

జన రంజకంగా వైసీపీ పాలన

విశాలాంధ్ర –అవుకు: అనేక సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలన జన రంజకంగా సాగుతుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. అవుకు పట్టణంలో గురువారం రెండో విడత గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండవ సచివాలయ పరిధిలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, వైసీపీ యువ నాయకుడు కాటసాని ఓబులరెడ్డి, చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, పట్టణ ఉపసర్పంచ్ చల్లా రఘునాథరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, దుగ్గిరెడ్డి రవీంద్ర నాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడియాల జయచంద్రారెడ్డిలు హాజరయ్యారు. ముందుగా బనగానపల్లి ఆర్ అండ్ బి రోడ్డు నుండి కోవెలకుంట్ల ఆర్ అండ్ బి రోడ్డు వరకు గ్రామపంచాయతీ మరియు మండల నిధులు 40 లక్షలతో నూతనంగా సిసి రోడ్డును ప్రారంభించారు. అనంతరం ఈ బీసీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, తెలుగు పేట కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి సమస్యలను తెలుసుకున్న ఆయన వెంటనే పరిష్కరించాలి అని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం కష్టపడే నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి అని మరోసారి ఆయనను ముఖ్యమంత్రిగా చేసుకుంటే మరింత అభివృద్ధి ఎంతో సంక్షేమాన్ని సాధించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా విక్రాంత్ రెడ్డి, కాంట్రాక్టర్లు కోవూరు మద్దయ్య, వంకదార సతీష్, గోపవరం గోపాల్ రెడ్డి, బలిజ సంఘం అధ్యక్షుడు రామన్న, మద్దిలేటి గౌడ్, వెంకటేశ్వర గౌడ్,వాయు నందన్ గౌడ్, ప్రభుత్వ అధికారులు, సచివాలయ ఉద్యోగులు,వాలంటరీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర – బనగానపల్లె : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి రక్షని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి శేషిరెడ్డి అన్నారు. గురువారం పలుకూరు లోని సచివాలయం2 లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంపీడీవో అనుగోలు శివరామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐదు శిబిరంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు మహమ్మద్, ప్రసూతి నిపుణులు కళ్యాణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ సోహెల్, డాక్టర్ కావ్య, కంటివైద్య నిపుణులు వెంకటేశ్వర్లు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వెంకట సుబ్బారెడ్డి, రాఘవయ్య, పుల్లారెడ్డి, ఈఓఆర్డి గురుప్రసాద్, ఈవో శ్రీనివాసులు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర –ఆత్మకూరు టౌన్: పట్టణంలోని పెద్ద బజార్లో ఉన్న పురాతన రామాలయం పునర్నిర్మాణ పనులు నత్త నడకన నడుస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆకస్మికంగా ఆలయ నిర్మాణ స్థలిని పరిశీలించారు. ఆలయ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న దేవదాయ శాఖ అధికారులతో ఆ నిర్మాణ పురోగతిని చర్చించారు. ఆలయ నిర్మాణ పనుల ఆలస్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆలయ పునర్నిర్మాణం కొరకు దేవాదాయ శాఖ విడుదల చేసిన నిధులు సరిపోవన్న సంగతి అర్థమైన ఎమ్మెల్యే వెంటనే ఆలయ నిర్మాణ పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని భక్తులకు సూచించారు. దేవాలయం నిర్మాణం కొరకు మరోసారి సిజిఎఫ్ గ్రాంట్ తీసుకు వస్తామని అందుకోసం తన సొంత నిధుల నుండి 10 నుంచి 20 లక్షలు దాకా మాచింగ్ గ్రాంట్ కు అందిస్తానని ప్రకటించారు. ఎమ్మెల్యే శిల్పా అప్పటికప్పుడు ప్రముఖ స్థపతులతో ఫోన్ ద్వారా సంప్రదించి తగు సూచనలు,సలహాలు స్వీకరించారు.

వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయి

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని తాలూకా బిజెపి బాధ్యులు భూమా కిషోర్ రెడ్డి అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తాను మంచి పనులు చేస్తుంటే ఎమ్మెల్యే, వైకాపా నాయకులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. బుధవారం రాత్రి చాగలమర్రి మండలం డి. కొత్తపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాను సొంత నిధులతో మంచినీటి బోర్ వేయించేందుకు బోర్ బండిని పంపిస్తే వైకాపా నాయకులు అడ్డుపడడం తగదన్నారు. కాలనీవాసులు పాత బోరు ఉందని అది పనిచేయడం లేదని మరమ్మత్తులు చేయించాలని తన దృష్టికి తీసుకొని రావడం జరిగిందన్నారు. నేను తయారు చేయిస్తానని వారికి హామీ ఇచ్చానన్నారు. ఆ రోజు నుండి నీవు ఏమి చేసావు అని ఆయన ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ఆ కాలనీవాసులు నీటి కోసం ఎన్నో రోజులుగా చూస్తున్నారని వారి నోటికాడి నీళ్ల తీసివేశావని భూమా కిషోర్ రెడ్డి విమర్శించారు. మంచి పనులు చేస్తుంటే అడ్డుకోవడం సరికాదన్నారు. అభివృద్ధి చేస్తే స్వాగతించాలి కానీ నేను చేయలేదు కదా అని మీరు చేయకూడదని అడ్డుపడడం ఎంతవరకు సబబన్నారు. వెంటనే ఎస్సీ కాలనీలో బోరు వేయించాలని మీరు వేయించిన పక్షంలో నేను అక్కడ బోరువేస్తానని భూమ కిషోర్ రెడ్డి స్పష్టం చేశారు.

పిత్తవాహికలో ఇరుక్కుపోయి..

విశాలాంధ్ర - కర్నూలు లీగల్ : రెండేళ్ల క్రితం స్టెంట్ వేసిన విషయాన్ని మర్చిపోయిన రోగి మళ్లీ తీవ్రంగా కామెర్లు, జ్వరంతో కర్నూలు కిమ్స్ ఆస్పత్రికి రాక సంక్లిష్టమైన శస్త్రచికిత్సతో నయం చేసిన డాక్టర్ జానకిరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అరుదైన కొలెడోస్కోపీతో మొత్తం రాళ్ల వెలికితీత రెండేళ్ల క్రితం తీవ్రంగా కామెర్లు వచ్చిన రోగికి వాటిని తగ్గించేందుకు ఒకస్టెంట్ వేస్తే.. ఆవిషయాన్ని మర్చిపోయి, దాన్ని తీయించుకోలేదు. దాంతో అది కాస్తా లోపల బాగా తుప్పు పట్టిపాడైపోయి, దానిచుట్టూ రాళ్లు ఏర్పడి తీవ్రసమస్యలకు కారణమైంది. అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సతో ఆ రోగికి ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ ఎస్.జె. జానకిరామ్ ఊరట కల్పించారు.

గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నియోజకవర్గంలోని 44వ వార్డు 114వ సచివాలయం పరిధిలో సీతారాం నగర్ నందు గడప,గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న జనరంజక పాలన,అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు.ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతిఒక్కరికి అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అవ్వ తాతలకు పెన్షన్లను ఎమ్మెల్యే పెన్షన్లు అందజేశారు.కార్యక్రమంలో 44వవార్డ్ కార్పొరేటర్ రాజేశ్వర్‌రెడ్డి, విజయ డైరీ జిల్లా చైర్మన్ యస్.వి జగన్ మోహన్ రెడ్డి, గోశాల చైర్మన్ అది మోహన్ రెడ్డి ,వైస్సార్సీపీ నాయకులు కర్ణాకర్ రెడ్డి, రైల్వే ప్రసాద్, నాయకులు,కార్యకర్తలు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైకాపాలకి చేరిక

విశాలాంధ్ర–కర్నూలు లీగల్ : కల్లూరు మండలం రేమడూరు గ్రామం నుంచి ఇద్దరు టీడీపీ వార్డు మెంబర్లు సహా పది కుటుంబాలు యువనేత సమక్షంలో వైసీపీలో చేరాయి. రేమడూరు టీడీపీకి పాణ్యం యువనేత కాటసాని శివ నరసింహరెడ్డి సమక్షంలో గురువారం వైసీపీ పార్టీలో చేరారు.వారిని ఒక్కక్కరిగా స్వాగతం పలికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈకార్యక్రమంలో రేమడూరు వైసీపీ నాయకులు నారాయణరెడ్డి,తిరుమలేష్,ఈశ్వరయ్య,పార్టీలో చేరిన రామాంజనేయులు, సుదర్శన్, బాలన్న, మద్దిలేటి, సురేష్, రాజు, కుమార్, యుగంధర్ తదితరులున్నారు.

సీపీఐ పోరాట ఫలితమే..

విశాలాంధ్ర –వెల్దుర్తి రూరల్ : సీపీఐ పోరాట ఫలితమే ప్రభుత్వం వెల్దుర్తి మండలాన్ని కరవుమండలంగా ప్రకటించడం జరిగిందని సీపీఐ మండల కార్యదర్శిటి.కృష్ణ, సహాయ కార్యదర్శి చిన్నమాదులు, గిడ్డయ్య, ఏఐఎస్ఎఫ్ మాజీ మండల నాయకులు రాము, అస్వర్ భాషలు అన్నారు.గురువారం వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా కరవు సహాయచర్యలు చేపట్టాలని, తక్షణమే ఎకరాకు రూ.50వేల నష్ట పరిహారం చెల్లింపు, పండించిన పంటలకు గిట్టుబాటు ధర, బ్యాంకుల్లో రైతులు తీసుకున్న పంటరుణాలు మాఫీ, ప్రతి రైతుకు రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి వీఆర్వో ఉమ్మన్నకు వినతిపత్రం సమర్పించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ పరిశీలన

విశాలాంధ్ర –కొలిమిగుండ్ల : మండలంలోని కనకాద్రిపల్లిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరమును జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి గురువారం పరిశీలించారు. ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో క్యాంపు ను నిర్వహించారు. శిబిరంకు వచ్చే ప్రజలకు ఏర్పాటు చేసిన వైద్య సౌకర్యాలను చైర్మన్ పరిశీలించారు. ప్రజల వద్దకి వైద్య సేవలు అందించి, ప్రజా ఆరోగ్యని కాపాడేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నదని తెలిపారు. సురక్ష క్యాంపులను ప్రజలుసద్వినియోగపరచుకోవాలని ఆయన తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ శివశంకర్, లాయర్ మహేశ్వర్‌రెడ్డి, వైసీపీ జిల్లా ప్రచార అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి, చెక్క వెంకట్ రాముడు, తిమ్మారెడ్డిలు పాల్గొన్నారు.

జగనన్నతోనే గ్రామ స్వరాజ్యం

విశాలాంధ్ర - చాగలమర్రి : జాతిపిత మహాత్మ గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తోనే సాధ్యమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని చింతలచెరువు, కొలు ములపేట గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఎంపీపీ వీరభద్రుడు,ఎంపీటీసీ రాజేశ్వరి, జేసీఎస్ జిల్లా కో- ఆర్డినేటర్ షేక్ బాబూలాల్,మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, నాయకులు గజ మాలతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.నాయకులు,కార్యకర్తలు వెంట నడిచారు.